# గౌతమీ గాథలు

ఇంద్రగంటి హనుమచ్ఛాస్త్రి

అమలాపురానికి 3 మైళ్ళలో కాలవగట్టున ఒక పల్లెటూరు. ఆ ఊరికి ఒకటే వీధి. పాత ఊరు వేరే ఉంది అమ్మవారి గుడితో కూడా తక్కిన వర్ణాలవారంతా అక్కడ వుంటారు.

ఇది కొత్త ఊరు. బ్రాహ్మలకోసం మాత్రమే ఆ వీధి ఏర్పడినట్టు. ఆ వీధిలో ఇంకే వర్ణాలవారూ లేరు.

సగం నియోగుల యిళ్ళు. తక్కినవి వైదికులవి. ఒక ఏర్పాటుకోసం రెండు తెగలు అనుకోవడంగాని అక్కడి నియోగు అందరివీ వైదికాచారాలే. పొగ తాగరు; స్నాన సంధ్యా ద్యనుష్ఠానాలు తప్పరు. గంధాక్షతలు ధరిస్తారు. ఊళ్లో ఉన్నప్పుడు చొక్కాలు తొడగరు. ఉద్యోగాలు చెయ్యరు- ఒకరో ఇద్దరో తప్ప. అందరికీ కొంత పల్లపుభూమీ. కొంత కొబ్బరితోటా ఉంటుంది. శ్రద్ధగా వ్యవసాయం చేస్తారు లేక చేయిస్తారు.

అన్నోదకాలకు లోటులేదు. ఎవరు వచ్చినా ఇంత పెడతారు. తాము తింటారు.

మా గురువుగారు నియోగులు. గంభీరమైన విగ్రహం. పొడుగుకు తగిన పుష్టి. స్నాన సంధ్యాదుల తర్వాత రామాయణ పారాయణం. పంచాయతన పూజ ఆయన నిత్యకృత్యాలు. వేషం వైదికమైనా గొప్ప వ్యవహర్త. అటు అమలాపురం కోర్టు వ్యవహారాలూ, ఇటు సాహిత్య వ్యాసంగం సవ్యసాచిలా నిర్వహించేవారు. కాని — ఆ కోర్టు వ్యవహారాలే లేకపోతే సాహిత్యాన్ని ఏలేవారు.

రాతకోతల్లో మంచి ముసద్దీ. ఆయన రాసిన కాగితం ఢిల్లీకి వెళ్ళినా తిరుగులేదని చెప్పుకునేవారు.

పేరు చెప్పలేదుగదూ- ఆయన పేరు వీరయ్య శాస్త్రిగారు. ఆయనకు నేనొక్కణ్ణే శిష్యుణ్ణి. ముందూ, వెనకా ఇంకొకరున్నట్టు వినలేదు. ఎట్లా దయగలిగిందో- నన్ను చేరదీసి నాలుగు కావ్యాలు, నాలుగు నాటకాలు చెప్పారు. కావ్యపాఠం రసప్రవాహం: నాటకం ఎదట ప్రదర్శనం చూస్తున్నట్లే: పాఠం ఇంటిదగ్గర అరుదు. పొలం గట్టో, కొబ్బరిచెట్లో మాతరగతిగది.

గురువుగారు గ్రామాంతరం వెడితే — మంథా నరసింహశాస్త్రులవారి దగ్గర చదివేవాడను.

గురువుగారు నన్ను పరాయిగా ఎప్పుడూ చూడలేదు. ఇద్దరు కొడుకుల తరవాత - మూడో వాణ్ణి నేను!

పనిబట్టి ఆయన కదిలితే - నేనూ వెంట వుండవలసిందే.

ముక్తేశ్వరందగ్గర సిరిపల్లెలో వారి బంధువులింట పెళ్ళి వచ్చింది. గురువుగారి పీఠం కదిలింది. పిన్నిగారూ, కుమార్తెలూ ముందే వెళ్ళారు. పెద్దకొడుకు వారితో వున్నాడు.

గురువుగారు మర్నాడు బయల్దేరారు.

అమలాపురం దాకా కాలవగట్టున నడిచి వెళ్ళి, ఎర్రవంతెనదగ్గర గుర్రబ్బండీ ఎక్కి, సాయంత్రం చీకటిపడుతూండగా సిరిపల్లె చేరాం. పేరుకు సిరిపల్లేగాని పల్లె

## సిరిపల్లె

కాలవ గట్టున అంతా పోగుచేసి అందరిళ్ళు ఆ గ్రామం సిరి! అంతా మోతుబర్లు. అన్నీ పాత కాలపు మండువా ఇళ్ళు. చెరువు లంతేసి పెరళ్ళు. అమలాపురం. ముక్తేశ్వరం రహదారీ ప్రక్క ఆ ఊళ్లో ఒక పెద్ద మండువా వారింట పెళ్ళి. నాలుగిళ్ళకు సరిపడా ఒకటే పెద్ద పందిరి. తెల్లటి చాందినీలతో రంగుకాగితపు బుట్టలతో అమోఘంగా అలంకరించారు.

ఇంకో పెద్ద భవంతిలో మా విడిది. మేం మొగపెళ్ళివారి తరపుగా బోలు. పందిట్లో మేజువాణీ జరుగుతోంది. ఆనాటి సాహిత్యరసికులకు మేజువాణీ నిషేధం లేదు. బావ వరసవాళ్ళు గురువుగారిని ముందు కూర్చోబెట్టారు. ఆ రోజుల్లో మేజువాణీముందు కూర్చోవడం అంటే — తమాషా కాదు. వేషాన్నిబట్టి హోదాని బట్టి మేళనాయకురాలు ముందు కూర్చున్న వారి మీద అభినయం పడుతుంది. తొణకకూడదు; బెణకకూడదు నాయకురాలు పట్టేకొంటె హస్తముద్రలు తనమీదే అనుకోకూడదు. అభినయం పట్టడ మంటే భరతం పట్టడం అన్నమాటే —

పెదవిమీదకు చిరునవ్వుకూడా జారకూడదు.

రసజ్ఞుడైన శ్రీశుకుడిలా కూర్చోవాలి.

గురువుగారు ఎక్కడికేనా బయలుదేరితే పిండుభొత్తాల నల్లకోటు తొడిగి దానిమీద సన్నజరీ పట్టు కండువా వేసేవారు.

నాయకురాలి పదాభినయానికీ, భావప్రదర్శనకీ గురువుగారి మెప్పు లభించింది ప్రౌఢఅయిన నాయకురాలు స్మితముఖి అయింది.

భోజనాలకి పిలుపు లొచ్చాయి. బంధువర్గమంతా కలిసి వెండిచెంబులతో, పట్టుబట్టలతో గాస్‌లైటు వెలుగులో బాండుమేళం దర్జాతో భోజనాలకు వెళ్ళాలి. నా మెడమీద పొడిఅంగవస్త్రం తప్ప పట్టువాసన లేదు. పిన్నిగారికి నామర్దా అనిపించింది. తమ పిల్లల పట్టుతాపితాలలో మంచిది తీసి కట్టుకోమని పెద్ద వెండిగ్లాసు చేతికిచ్చారు. అప్పుడు నేను విద్యార్థినిగాను; వారి ముఖ్య బంధువును!

మర్నాడు ఉదయం— చీకటితోటే ఊరి పక్క ఉన్న డామ్‌దగ్గర పిల్లకాలవ గట్టు చెంత ప్రాతఃకాల కృత్యాలు తీర్చుకుని స్నానానికి దిగాం. గురువుగారి పెద్దబ్బాయి పక్కనే స్నానం పూర్తిచేసి తుడుచుకుంటున్నాడు నేను ఒక్క అడుగు ముందుకు వేసి మునిగిపోయాను నీటిలో కొట్టుకుంటున్నాను. కళ్ళనిండా నీటి తెరలు- ఏమీ కనిపించదు. తృణం దొరికితేచాలు. పట్టుకుందామని తహతహ. దిక్కుతోచక తడుముకుంటున్నాను.

పెద్దబ్బాయి చూశాడు. చెంగున దూకి జుట్టు పట్టుకున్నాడు. ఇంకెక్కడ పట్టుకున్నా మునిగినవాడు వాటేసుకుని కదలనివ్వడు. ఇద్దరికీ చావు ఖాయం. మునిగినవాడు కొంచెం అలిసి పట్టుకునేశక్తిహీనుడు కావాలి. అప్పుడు ఒడ్డుకు సునాయాసంగా లాగవచ్చు. ఆ అబ్బాయి అట్లాగే చేసి ఒడ్డున పడేశాడు.

నీళ్ళట్టే తాగలేదు. తేరుకుని అతనితో విడిదిలోకి వెళ్ళాను.

ఇద్దరం ఏమీ ఎరగనట్టు పెళ్ళివారు అప్పుడే పంపిన వేడివేడి ఉప్మా ఇష్టంగా తింటున్నాం.

కాలవలో నేను మునిగిపోవడం చూసిన ఒకాయన పక్కవారితో "పాపం ఈ ఉప్మా తినే యోగం ఉంది. ఈ అబ్బాయికి. క్షణం కిందట మృత్యువు ముఖంలోనుంచి బయటపడ్డాడు. ఎంత అప్యాయంగా తింటున్నాడో" అంటున్నాడు. లోపల నవ్వుకున్నాను.

చావుకీ, బతుకికీ ఒక సన్నని రేఖే అడ్డం కాబోలు!

మధ్యాహ్నం విందుభోజనంకూడా చేసి స్వగ్రామం బయలుదేరాం.

అట్లా - గురువుగారు విద్యాదానంచేస్తే గురుపుత్రుడు నాకు ప్రాణదానం చేశాడు.